రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులపై చర్యలు: డిఎంహెచ్ఒ

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో రిజిస్ట్రేషన్, రెన్యువల్ కాని ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎపిఎంసిఇ యాక్ట్ 2008, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, జిఒ నంబరు 135, 35ను అనుసరించి జిల్లాలోని ఆస్పత్రులు, ఫిజియోథెరపీ, డెంటల్ క్లినిక్స్, లేబొరేటరీలను కొత్తగా ఏర్పాటు చేస్తే జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకొని సర్టిఫికేట్ పొందాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకుని ఐదేళ్లు పూర్తయిన తర్వాత తిరిగి తప్పనిసరిగా రెన్యువల్ సర్టిఫికేట్ పొందాలని పేర్కొన్నారు. జిల్లాలో విజిలెన్స్ అధికారులు విస్తృతంగా చేస్తున్నారని, ఎటువంటి రిజిస్ట్రేషన్, రెన్యువల్ లేకుండా ఆస్పత్రులు, ఫిజియోథెరపీ, డెంటల్ క్లినిక్స్, లేబొరేటరీలను నిర్వహిస్తున్నట్లు రుజువైతే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్డులో చేరాలంటే..

కాళ్లరుగుతున్నాయి

అవకాశం కల్పించినా ఎన్నో అడ్డంకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది. కానీ కొత్తకార్డు కావాలన్నా, మార్పు జరగాలన్నా వివిధ రకాల ధ్రువపత్రాలు, అనుబంధ పత్రాలు కోరడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక పరమైన చిక్కులు, కార్యాలయాల చుట్టూ తిరిగినా కార్డు దక్కడంలేదని జనం వాపోతున్నారు.

శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ యువకుడు పార్వతీపురానికి చెందిన యువతిని వివాహ మాడాడు. వీరికి వివాహమై ఏడేళ్లు గడిచింది. తన కార్డులో భార్య, పిల్లల పేర్లు చేర్చాలని ఆ యువకుడు కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు నగరంలోని మహాలక్ష్మి నగర్ కాలనీ సచివాలయానికి వెళ్లాడు. అక్కడున్న సచివాలయ సిబ్బంది వివాహ ధ్రువపత్రం కోరారు. దీని కోసం సబ్‌రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లగా వయసు నిర్ధారణకు ఆధార్‌తో పాటు స్టడీ సర్టిఫికెట్ అడిగారు. వివాహం అయినట్లు పెళ్లి కార్డు, పెళ్లి చేసుకున్నట్లు ఫొటో అడిగారు. స్టడీని 1998లో చదివిన పాఠశాలకు వెళ్లి తీసుకొచ్చారు. ఇన్ని ఇబ్బందులు పడి ధ్రువీకరణ పత్రం తీసుకొస్తే యువతి పేరు తన తల్లిదండ్రుల రేషన్‌కార్డులో ఉందని, అక్కడ తొలగించాక రమ్మని చెప్పి, పంపించారు. ఇన్నాళ్లకు కార్డులో తన భర్త, పిల్లలతో చేరేందుకు అవకాశం వచ్చిందని ఆశపడ్డ ఆ యువతి అక్కడి సచివాలయానికి వెళ్తే మీ తల్లిదండ్రుల కార్డు నుంచి పేరు తొలగించడం ఎప్పుడో జరిగిపోయిందని చెపుతున్నారు. ఇంతలో గడువు ముగిసిపోయి వెబ్ ఆప్షన్ తొలగిస్తారేమో అన్న భయం ఆ దంపతులను వెంటాడుతోంది.

గతంలో ఇలా..

కార్డులో మార్పులకు పెట్టుకున్న దరఖాస్తులను సంబంధిత విఆరన్‌ఒలు పరిశీలించి, నివాస ధ్రువపత్రం మంజూరు చేసేవారు. దీన్ని సంబంధిత కార్యాలయం లో సమర్పిస్తే కుటుంబ సభ్యులుగా గుర్తించి కార్డులో వారి పేర్లు చేర్చేవారు.

పేరు తొలగించాల్సి వస్తే అందుకు అవసరమైన కారణాలను నిర్ధారించే ధ్రువపత్రం సమర్పిస్తే పని పూర్తయ్యేది. కాని ఇప్పుడు చేర్పులు, మార్పులు జరగాలంటే కాళ్లు అరిగి పోవాల్సిందే.

ఎన్నో అడ్డంకులు

భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న మహిళలకు ప్రభుత్వం పథకాలు అందిస్తోంది. వీటిని పొందాల్సిన వారికి ఒంటరిగా ఉన్నట్లు రేషన్‌కార్డు తప్పని సరి. కానీ చాలా మందికి భర్తతో కలిసి ఉన్న కార్డులే ఉన్నాయి. కొత్త దాని కోసం వెళ్తే విడాకుల ధ్రువపత్రం అడుగుతున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో విడిపోయిన వారికి పత్రాలు తీసుకు రావడం సాధ్యం కావడం లేదు.

కొత్తగా పెళ్లి అయిన వారి పేర్లను కార్డుల్లో చేర్చాలం టే ధ్రువపత్రం కావాలి. వివాహమై ఏడేళ్లు గడిచిన వారి పేరు చేర్చాలం టే ఇంటింటి సర్వేలో మ్యాపింగ్ జరిగి ఉండాలని చెబుతున్నారు. దీని కోసం వివాహ ధ్రువపత్రం అవసరం. జిల్లాలో పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్లు చేసుకునే అలవాటు లేకపోవడంతో కొందరు అవస్థలు పడుతున్నారు.

అదనపు ఖర్చు

వివాహ ధ్రువపత్రం కావాలంటే ప్రభుత్వ చలానాగా రూ.200 చెల్లించాలి. కానీ బయట ఖర్చులు రూ.2 వేల వరకు అవుతున్నట్లు బాధితులు చెపుతున్నారు.

పెళ్లితో ఒక్కటైనా కార్డులో వేరుగా



పెళ్లై ఎక్కువ సంవత్సరాలు అయిన వారికి పత్రాలు కావాలంటే దంపతుల విద్యార్హత, స్టడీ సర్టిఫికెట్లు, పెళ్లి ఫొటో, ఆహ్వాన పత్రిక జతచేయాల్సి ఉంటుంది.

నిరక్షరాస్యులకు వయసు నిర్ధారణ పత్రాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎముకల వైద్యుల నుంచి తీసుకోవాలి.

గ్రామీణ ప్రాంతాల్లో వీరు లేకపోవడంతో జిల్లా కేంద్రం, టెక్కలి వెళ్లాల్సిన పరిస్థితి. దీని కోసం రూ.వేలల్లో ఖర్చవుతున్నట్లు చెబుతున్నారు. గతంలో పంచాయతీ కార్యాలయం లో పూర్తయ్యే పనుల కోసం ప్రస్తుతం సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. కొత్తగా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్టు చెపుతున్నా కార్యరూపం దాల్చలేదు. సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల వద్ద వివాహ ధ్రువపత్రాల కోసం విదేశాలకు వెళ్లే వారు తప్ప ఇతరులు కనిపించరు. కానీ ప్రస్తుతం రేషన్‌కార్డు కోసం వివాహ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జతచేయాల్సి ఉండటంతో భారీగా వస్తున్నారు.

నిబంధనల మేరకు

రేషన్ కార్డుల విషయంలో అనుసరించాల్సిన నిబంధనలను ప్రభుత్వం తెలియజేసింది. సంబంధిత ధ్రువపత్రాలు ముందుగా సమర్పిస్తే ఎక్కడా తిరగాల్సిన అవసరం ఉండదు. పత్రాలు లేకపోతే సంబంధిత నోటరీని సమర్పించే వెసులుబాటు కల్పించారు.

- డివి.రమణ,
జిల్లా పౌర సరఫరాల అధికారి, శ్రీకాకుళం



ధర్నా చేస్తున్న విఆర్ఎలు

విఆర్ఎలపై ప్రభుత్వం చిన్నచూపు

- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి
- ముఖ హాజరు నుంచి మినహాయించాలి
- విఆర్ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.సత్యనారాయణ
- కలెక్టరేట్ వద్ద విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయిలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఎ)పై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు సత్యనారాయణ విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ నుంచి మినహాయించాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యాన విఆర్ఎలు నగరంలోని ఆర్అండ్‌బి బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ హాజరు విధానంతో విఆర్ఎలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తక్షణమే ఈ విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విఆర్ఎల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు ఉన్నారని, కొందరి వద్ద సెల్‌ఫోన్ కూడా లేని దుస్థితిలో వారి జీవనం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు మండల కేంద్రాల్లో వీరు నిరంతరం పనిచేస్తున్నారని, వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏళ్ల తరబడి వేతనాలు పెంచకుండా వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. ముఖ హాజరు వల్ల హాజరు నమోదు కాకపోతే వచ్చే అరకొర వేతనాలూ రావని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేసిన రోజున సైతం వేతనాలు పొందలేని దుస్థితి ఎదురవుతుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో వీరికి చెల్లించిన డిఎలను రికవరీ చేస్తున్నారని, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలన్నారు. డిఎ కూడిన వేతనం ఇవ్వాలన్నారు. నామినీలను విఆర్ఎలుగా పరిగణించి కొనసాగించాలని, అర్హులైన వారిని విఆర్ఒ, అటెండరు, వాచ్‌మెన్ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో, విజయవాడ అలంకార్ ధర్నా చౌక్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.త్రినాధరావు మాట్లాడుతూ కరోనా కాలంలో రికవరీ చేసిన రూ.2,160 తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘ నాయకులు సీతప్పడు, జి.వెంకటరమణ, మల్లేశు, కె.రమణమూర్తి, బి.అప్పారావు, రాములమ్మ, లక్ష్మి, మీనాక్షి, వాసు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ బందోబస్తు

ఎస్‌పి జి.ఆర్ రాధిక



అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - జలుమూరు

ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు శ్రీముఖలింగంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. మండలంలోని శ్రీముఖలింగేశ్వర ఆలయం వద్ద చేస్తున్న ఏర్పాట్లను, స్వామి వారిని చక్రతీర్థస్నానాలకు తీసుకువెళ్లే రహదారిని నదీ పరివాహకం వరకు మంగళవారం పరిశీలించారు. రూట్ మ్యాప్ ద్వారా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. ఆలయ ముఖద్వారం నుంచి లోపలకు వెళ్లే యాత్రికులకు దర్శనం సజావుగా సాగేలా చూడాలన్నారు. యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున బారికేడ్లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చక్రతీర్థ స్నానాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు నదిలోనూ పటిష్టంగా బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు ప్రత్యేకంగా స్టాండ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

చక్రతీర్థ స్నానాల అనంతరం యాత్రికులు తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్‌జామ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత శ్రీముఖలింగేశ్వరుని దర్శించారు. తహశీల్దార్ బి.సత్యం ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ పి.ప్రభాకరరావు, నరసన్నపేట సిఐ డి.రాము, ఎస్ఐ పి.పారినాయుడు, ఇఒపిఆర్‌డి ఉమామహేశ్వరరావు, అర్చకులు, దేవాదాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోలు చేయకపోతే పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - కంచిలి

రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. మండల కేంద్రంలోని కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతుల వద్ద ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అధికారులు చెప్తున్నా, ఇప్పటికీ 50 శాతం కూడా కొనుగోలు చేయలేదన్నారు. పెసర, మినుము పంటలు ఉండడంతో ధాన్యం ఇంకా పొలాల్లోనే ఉంటే లక్ష్యాలు ఎలా పూర్తయ్యాయని ప్రశ్నించారు. అనధికారికంగా వచ్చిన ధాన్యంతో లక్ష్యాలను పూర్తి చేశారని తెలిపారు. బ్యాంకు గ్యారంటీ పూర్తయిందని మిల్లర్లు ధాన్యం తీసుకోవడం లేదన్నారు. పొలాల్లో ఉన్న ధాన్యాన్ని పందులు తినేస్తున్నాయని, అగ్ని ప్రమాదంలో కాలిపోయి రైతులు నష్టపోతున్నారని చెప్పారు. కంచిలి మండలంలో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన చేస్తే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దగ్గర ఉన్న మిల్లులకు కాకుండా ఇతర ప్రాంతాల మిల్లులకు పంపడం వల్ల రైతులపై అదనపు రవాణా ఛార్జీల భారం పడుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల వద్ద ఉన్న ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలన్నారు. ఈనెల 15వ తేదీ వరకు గడువు పెట్టకుండా ధాన్యం కొనుగోలు సమయం పెంచాలని, ఏ మండలంలోని ధాన్యాన్ని ఆ మండలంలోని మిల్లుకు పంపాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, కె.గోపీనాథ్, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని హుండీ ఆదాయం రూ.82.55 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీ ఆదాయం రూ.82.55 లక్షలు సమకూరింది. ఆలయంలోని అనివెట్టి మండపంలో ఆలయంలోని హుండీలను మంగళవారం లెక్కించారు. గతేడాది డిసెంబరు 30 నుంచి ఈనెల 14వ తేదీ వరకు నోట్ల రూపంలో రూ.80,01,117, చిల్లర నాణేల రూపంలో రూ.2,54,047 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. మొత్తంగా నగదు రూపంలో రూ.82,55,164 సమకూరింది. దీంతోపాటు 58.500 గ్రాముల బంగారం, 3.390 కిలోల వెండి సమకూరినట్టు తెలిపారు. విదేశీ మారక ద్రవ్యం యునైటెడ్ అరబ్ సెంట్రల్ బ్యాంకు 5 దిర్హామ్‌లు, సింగపూర్ కరెన్సీ 5 డాలర్లు, నేపాల్ రాష్ట్ర బ్యాంకు రూ.15, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 15 డాలర్లు వచ్చాయని వివరించారు. హుండీ లెక్కింపును విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డి.వి.వి ప్రసాదరావు అరసవల్లి ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పర్యవేక్షించారు. దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ బి.వి.వి.ఆర్ ప్రసాద్ పట్నాయక్, సీనియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్ రవికుమార్, ఒకటో పట్టణ ఎస్ఐ బి.గణేష్, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లోనూ పనులు ప్రారంభించాలి

డ్వామా పీడీ జీవి చిట్టిరాజు



పనులు పరిశీలిస్తున్న చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ ఉపాధి హామీ పనులు చేపట్టి, కూలీలకు ఉపాధి కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం రూరల్ మండలం కుందువానిపేటలో జరుగుతున్న చెరువు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ రెండు పూటలు, కనీసం ఆరు గంటల సమయం పనులు చేస్తే రూ.250 కూలి అందుతుందని పేర్కొన్నారు. వంద రోజుల పని దినాలను కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకాన్ని జాబ్‌కార్డు ఉన్న కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పని ప్రదేశాల్లో నీరు, నీడ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయితీ స్థాయిలో అన్ని రికార్డులనూ పూర్తి చేయాలని, అదేవిధంగా ఇఎంఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే మస్టర్లు లోడ్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సీతారాం, జెఇ పి.బాలముకుందబాబు, ఇతర ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రులకు రైతు సమస్యలు పట్టవా?



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - నందిగాం

చివరి ధానం గింజా కొనుగోలు చేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న జిల్లాకు చెందిన మంత్రులకు రైతుల సమస్యలు పట్టడం లేదని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రక్ షీట్లలో జాప్యం వల్ల రైతులు మూడు, నాలుగు రోజులు ట్రాక్టర్లతో వేచి ఉంటున్నారని, వాహనాలకు అద్దెలను చెల్లించుకోలేక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి పలువురు రైతులు తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు చెమటోడ్చి సాగుచేసిన వరిని ప్రభుత్వం కొనకుంటే రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. టిడిపి హయాంలో రైతులకు అవసరమైన విత్తనాలు, సాగునీరు, వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు సబ్సిడీపై అందించామని అన్నారు. వైసిపి ధాన్యం కొనుగోళ్లలో రైతులను తీవ్ర ఇబ్బందులు పెడుతోందన్నారు. రూ.400 కోట్లు కేటాయించి ఆఫ్‌షోర్ నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లామని, వైసిపి వచ్చిన మూడున్నరేళ్లలో కనీసం పనులు చేపట్టలేదన్నారు. టిడిపి హయాంలో డీజిల్, నూనె, ఇసుక, విద్యుత్ ఛార్జీలు పరిమితంగా ఉంటే వైసిపి అధికారంలోకి వచ్చాక మూడు రెట్లు పెరిగాయని ఆరోపించారు. నందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల, నౌగాంలో పిహెచ్‌సి, ప్రతి గిరిజన గ్రామానికి రహదారి, కాలువల సదుపాయం కల్పించామని అచ్చెన్నాయుడు అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దోమపోటు వస్తే జిల్లాకు రూ.27 కోట్లు అందించిన ఘనత టిడిపిదేనని అన్నారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఖరీఫ్‌సీజన్‌లో రైతు అవసరాన్ని ముందే ఊహించి నీరు అందించామని చెప్పారు. నందిగాంలో రైతు పండించిన ధాన్యం సారవకోట, నరసన్నపేట వెళ్లి అమ్ముకోవాల్సిన దుస్థితి ఈ ప్రభుత్వంలో కలిగిందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకుంటే వారి తరపున పోరాడుతామని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్‌కుమార్, మల్లా బాలకృష్ణ, కె.ప్రసాదరావు, ఎస్.జానకిరాం, కె.తాతయ్య, పి.చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో కేంద్ర బృందం పర్యటన



కిడ్నీ రోగితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధి, కోవిడ్ అనంతరం ఉద్దానం ప్రాంతంలో ప్రజల ఆరోగ్య పరిస్థితులు, తదితర అంశాలపై పూర్తిస్థాయిలో సమాచారం తెలుసుకోవడానికి కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. జార్జ్ ఇనిస్టిట్యూట్, ఐసిఎంఆర్ బృందాలు మండలంలోని పల్లిసారథి, గొల్లసారథిలో సంయుక్తంగా పర్యటించారు. ఈ సందర్భంగా కోవిడ్ బారినపడిన వారు, కోవిడ్ టీకాలు వేయించుకున్న వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వారి నుండి రక్త నమూనాలు సేకరించారు. కొంతమందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కిడ్నీ వ్యాధిపై అవగాహన కలిగించారు. ఆహార నియమాలు, వ్యాయామంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. దాహానికి గోరు వెచ్చని నీరు తీసుకోవాలని తెలిపారు. పర్యటనలో పరిశోధన వైద్య బృందం సభ్యులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ షైనీ, డాక్టర్ కవిత, సూపర్ వైజర్ సత్యనారాయణ, సికెడి కౌన్సిలర్ దుర్యోధన, వైద్యఆరోగ్యసిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో యువతి మృతి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు



పూజిత (ఫైల్)

మండలంలోని బైపల్లి గ్రామానికి చెందిన దుమ్ము పూజిత(19) కిడ్నీ వ్యాధితో మంగళవారం మృతి చెందారు. ఈమె తండ్రి దుమ్ము పాపారావు కిడ్నీ వ్యాధితోనే మృతి చెందారు. తండ్రి మరణంతో తల్లి రోహిణి సిమెంట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ.. ఇంటర్మీడియట్ వరకు కుమార్తెను చదివించింది. ఆరు నెలల క్రితం పూజితకు కిడ్నీ వ్యాధి ఉన్నట్లు తెలిసింది. శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రికి వెళ్లి మందులు వాడారు. పది రోజుల క్రితం ఆమె పరిస్థితి విషమించడంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటోంది. పరిస్థితి విషమించి ఆమె మంగళవారం మృతిచెందింది. గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. మృతురాలికి తమ్ముడు తేజేశ్వరరావు ఉన్నారు. కిడ్నీ వ్యాధితో యువతి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


మాట్లాడుతున్న రవికుమార్

ధాన్యం కొనుగోలుపై లక్ష్యాలు విధించడం దుర్మార్గం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

రైతులు పండించిన వరిపంట మొత్తాన్ని కొనాల్సిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై అధికారులకు లక్ష్యాలను విధించడం దుర్మార్గమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రం పొందూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైతుల నుంచి ప్రతి గింజా కొనుగోలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ధాన్యం కొనుగోలుపై లక్ష్యాలు విధించి రైతులను దగా చేస్తున్నారని విమర్శించారు. ఇంకా రైతులు కల్లాల్లోనే ధాన్యం కుప్పలు ఉన్నాయని, లక్ష్యాలు విధిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. మండలంలోనే ఇంకా సుమారు ఐదు వేల ఎకరాల్లో 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. రైతులకు నష్టం కలిగేలా ప్రభుత్వం వ్యవహరిస్తే కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం మెడలు వంచైనా రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి వేల కోట్లు అక్రమ ఆదాయాన్ని తెచ్చిపెట్టే మద్యం, ఇసుక, మైనింగ్ రంగాలపైనే మోజు అని, ఇతరరంగాలు ఏమైనా పట్టింపు లేదని అన్నారు. ఈయనతో పాటు మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్.రామ్మోహన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరభాస్కర్, చేనేత సొసైటీ మాజీ అధ్యక్షులు కాలేపు శ్రీను, ఎంపిటిసి మాజీ సభ్యులు శ్రీనివాసరావు, పట్టణ మాజీ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న సూర్యనారాయణ

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

కంచిలి: 14 ఏళ్లలోపు వయసు గల పిల్లలను పనుల్లో పెట్టుకుంటే సంబంధిత షాపు యజమానులపై కేసులు నమోదు చేస్తామని సోంపేట కార్మికశాఖ అధికారి పి.సూర్యనారాయణ హెచ్చరించారు. జిల్లా మానవ అక్రమ రవాణా విభాగం ఎస్ఐ ఎస్.కేశవరావు, పోలీస్ సిబ్బందితో కలిసి కంచిలిలోని పలు దుకాణాలు, సంస్థల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ బేకరీలో 14 ఏళ్ల లోపు బాలుడుతో పనిచేయడం గుర్తించారు. షాప్ యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ బాలలను ఎటువంటి పనుల్లో వినియోగించకూడదన్నారు. తనిఖీల్లో ఐసిడిఎస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలం

డిప్యూటీ డిఎంహెచ్ఒ కృష్ణమోహన్


శ్రీకాకుళం అర్బన్ : సైకిల్ తొక్కుతున్న కృష్ణమోహన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ సైకిల్ తొక్కడం ద్వారా శారీరక వ్యాయామం జరుగుతుందని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ జె.కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య మేళాలు ప్రతినెలా 14న నిర్వహించనున్నట్లు తెలిపారు. పెరుగుతున్న వాహన వినియోగం వల్ల సుఖవంతమైన జీవనానికి అలవాటు పడి శారీరక శ్రమ తగ్గుతోందని అన్నారు. దీనివల్ల ఎక్కువమందిలో ఉబకాయం, హైపర్ టెన్షన్, చక్కెర వ్యాధి, కేన్సర్, గుండె జబ్బులు వస్తున్నాయని అన్నారు. సరైన వ్యాయామం ద్వారా ఈ రోగాల బారిన పడకుండా నయం చేసుకునేందుకు తప్పని సరిగా ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. మరో వైపు వాహనాల వాడకం తగ్గించడం వల్ల కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ర్యాలీలో వైద్య ఆరోగ్య సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.


జి.సిగడాం : సైక్లింగ్ చేస్తున్న డాక్టర్ యశ్వంత్

ఆమదాలవలస: క్రమం తప్పని ఆరోగ్య అలవాట్లను ప్రతి ఒక్కరూ పాటించాలని కమిషనర్ కె.అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని మోనింగివారి వీధిలో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహనా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ బి.లక్ష్మీ నారాయణ, కె.వి.సుబ్రమణ్యం, సిహెచ్.శ్రీనివాసరావు, పెంటయ్య, వైద్యులు నమ్రతారాయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలాగే తొగరాం పిహెచ్‌సి వైద్యాధికారి స్రవంతి ఆధ్వర్యాన కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ... సైక్లింగ్ నిర్వహించారు. శ్రీనివాసరావు, మల్లిబాబు, రమేష్ పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని పెద్దపేట పంచాయతీ జగన్నాథపురంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేన్సర్, చికిల్ సెల్ ఎనీమియా డాక్టర్ పేడాడ శ్రావ్య అవగాహన కల్పించారు. పొగాకు, ఖైనీ, గుట్కాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, పెద్దపేట ఉప సర్పంచ్ డి.వి.ఎ.నాయుడు, జల్లు ఆదినారాయణ, ఆశా వర్కర్లు ధనలక్ష్మి, భారతి, గీత, హెల్త్ అసిస్టెంట్ జగదీష్ పాల్గొన్నారు.


ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

జి.సిగడాం : ఆయుష్ భారత్‌లో భాగంగా మండలంలోని పెంలో సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు సి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యశ్వంత్ ప్రారంభించి కేన్సర్, తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు.


బూర్జ : అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రావ్య

రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి

- బాధితులతో కలిసి 27న కలెక్టరేట్ వద్ద ధర్నా
- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాచలం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని మండాది వద్ద లారీ ఢీకొని నలుగురు ఉపాధిహామీ మహిళా కూలీలు మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షలు ఇవ్వకుంటే ఈనెల 27న కలెక్టరేట్ వద్ద బాధిత కుటుంబాలతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు. నలుగురు మహిళలు మృతి చెంది పదకొండు రోజులు కావస్తున్నా ఇప్పటివరకు అటు ప్రభుత్వంలోను, ఇటు వైసిపి నాయకులలోను చలనం లేకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు, ఒక స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఇప్పటి వరకు బాధి


పరామర్శిస్తున్న సింహాచలం, ఈశ్వరమ్మ

కుటుంబ సభ్యులను పరామర్శించడానికి తీరిక లేకపోవడం విడ్డూరంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. ప్రజల సొమ్ముతో హోదాలను వెలగబెడుతున్న నాయకులకు మహిళల మృతి కానరాలేదా? అని ప్రశ్నించారు. విజయనగరం జిల్లాకు చెందిన జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు చెందిన లారీ కావడంతోనే అటు పోలీసులు, ఇటు స్పీకర్, జిల్లా మంత్రులు ఈ ఘటనపై నోరు మెదపడం లేదని ఆరోపించారు.

బాధితులకు గొండు శంకర్ సాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని రెల్ల వీధిలో సంభవించిన అగ్ని ప్రమాదంలో రెల్ల గుణేశ్వరరావు పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంతో కట్టుబట్టలు మినహా మిగిలిన వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. అనంతరం నిత్యావసర సరకులను అందజేశారు. నిరుపేద కుటుంబమైన గుణేశ్వరరావును అన్ని విధాలా ఆదుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాండ్రంకి శంకర్, అంబటి లక్ష్మీరాజ్యం, పి.వి.రమణ, బుర్రి మధు, రెడ్డి శంకర్, నాగేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


దుస్తులను పంపిణీ చేస్తున్న శంకర్

నకిలీ మావోయిస్టు లేఖపై కేసు నమోదు

ప్రజాశక్తి- పలాస

మంత్రి సీదిరి అప్పలరాజు, బొడ్డపాడు సర్పంచ్ తామాడ మాధవ్‌పై మావోయిస్టు సాధన సమితి పేర మరోమారు మావోయిస్టుల పేర లేఖ విడుదలైంది. రెండు రోజులుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆ లేఖ నకిలీదిగా నిర్ధారించారు. ఎవరో గిట్టని వారు మంత్రి, సర్పంచ్ దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని లేఖలో పేర్కొన్నారని కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గాయపడిన మహిళ మృతి

టెక్కలి రూరల్ : టెక్కలి మండలం గూడెంకు చెందిన కొర్లాన సుమిత్ర (24) కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఇటీవల ఇంట్లో వంట చేస్తుండగా చీరకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడింది. ఆ సమయంలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం, అక్కడ నుంచి కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. సిఐ ఎస్.సూర్యచంద్రమౌళి మంగళవారం గూడెంకుని తహశీల్దార్ కుమార్ పంచనామా నిర్వహించారు. అనంతరం దహన సంస్కారలను నిర్వహించారు. ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వైద్యం అందిస్తున్న వైద్యాధికారి

ఎండిఎం కార్మికురాలికి గాయాలు

మెళియాపుట్టి : మండలంలో జాడుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎండిఎం (మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు) మల్లిపెద్ది రమ మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో గాయపడింది. పాఠశాల ఆవరణలో కట్టెలపై వంట చేస్తుండగా చీరకు నిప్పంటుకోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు చాపర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

వ్యక్తికి...

టెక్కలి రూరల్ : మండలంలోని అక్కవరం జాతీయ రహదారిపై మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ జాతీయ రహదారి అంబులెన్స్ సహాయంతో క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు.


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో

తాడివలస విద్యార్థులకు పతకాలు

పొందూరు: ఎన్‌టిఆర్ జిల్లా మాంటిసోరి ఇండోర్ హాల్‌లో ఈ నెల 11,12 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, క్యాడెట్ జూడో ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ సత్తాను చాటి పలు పతకాలను సాధించారు. పాఠశాలకు చెందిన మెట్ట ఛార్మి రజితం కైవసం సాధించగా, మెట్ట చాందిని, కూన శివరామరాజు, వాకముల్లు కౌశిక్, కొత్తకోట నితిన్‌లు కాంస్య పతకాలు సాధించారని వ్యాయామ ఉపాధ్యాయులు పైడి సునీత తెలిపారు. పతకాలు సాధించిన విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు, సిబ్బంది అభినందించారు.

బ్రాహ్మణతర్లాలో 'ఉపాధి' పనుల ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న వెంకటరావు చిట్టి

ప్రజాశక్తి- పలాస

ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి కోరారు. మండలంలోని బ్రాహ్మణతర్లా పంచాయతీలో ఉపాధి పనులను మంగళవారం ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలసలు నివారించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తుందన్నారు. ఏటా ఖరీఫ్ పనులు అనంతరం ఉపాధి పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. మస్టర్ ప్రకారం పనులు చేసి కనీస కూలి వచ్చేలా పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బడాన పుష్ప, మాజీ ఎంపిటిసి దంతం వైకుంఠరావు, ఉప సర్పంచ్ పొందర ఈశ్వరరావు, ఆనెం రామారావు, సల్ల కామరాజు, గరిక ధర్మారావు పాల్గొన్నారు.

గృహ సారథులకు ఆహ్వానం


ఈ నెల 16న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధ్యక్షతన ప్రగతిభవన్ ప్రాంగణంలో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో గృహ సారథుల ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాడన పుష్ప, గ్రామ పార్టీ అధ్యక్షులు దంతం వైకుంఠరావు, ఉప సర్పంచ్ పొందర ఈశ్వరరావు, అనెం రామారావు, గరికి ధర్మారావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ ఇసుక ఏమైంది

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని తిర్లంగి సచివాలయం పరిధిలో జగనన్న కాలనీ లబ్ధిదారులు పేర్లతో తీసుకున్న ఇసుక ఏమైనట్లు హౌసింగ్ ఎఇని తిర్లంగి ఎంపిటిసి బెండి దేవయాని ప్రశ్నించారు.

దీంతో ఎఇ సమాధానం చెప్పలేక దాటవేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అట్లా జరోజనమ్మ అధ్యక్షతన మండల మండల సమావేశం నిర్వహించారు. టెక్కలిలో రోడ్లు, కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే... జగతిమెట్ట దగ్గర రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు


నిలదీస్తున్న ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి

ఎలాచేశారని ఎంపిటిసి వాకడ శ్రీధర్‌రెడ్డి నిలదీశారు. ఎంపిటిసి కూన పార్వతి టెక్కలి చిన్నబజార్ చేపల మార్కెట్ రోడ్డు కాలవపై టిడిపి ప్రభుత్వంలో షాపులు కట్టి అర్ధాంతంగా నిలిచిపోయాయని, షాపులు తొలగించి కాలువ నిర్మాణం చేపట్టాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. మండిపోలం కాలనీలో విద్యుత్ స్తంభాలు మార్చమని పీత హెమలత సభ దృష్టికి తెచ్చారు. సచివాలయం ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ఎంపిటిసి సత్తారు ఉషా ఎఒ గురుబెల్లి రంగారావు కోరారు. సమావేశానికి ఎంపిడిఒ ఉమాసుందరి, వైస్ ఎంపిపిలు పేడాడ రమేష్, మన్నెల కిషోర్, మండల ప్రత్యేకాహ్వానితులు నాగళ్ల శంకరరావు పాల్గొన్నారు.


విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంజీవయ్యకు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజల అభ్యున్నతికి పాటుపడిన నిజాయతీ గల వ్యక్తి దామోదర సంజీవయ్య అని కాంగ్రెస్ పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు అన్నారు. నగరంలోని సంజీవయ్య పార్కులో 102వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో మొదటి దళిత ముఖ్యమంత్రిగా పని చేశారని గుర్తుచేశారు. నిరుపేద కుటుంబం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి స్థాయికి ఎదిగిన సంజీవయ్య నిజాయితీతో రాజకీయాల్లో కొనసాగారన్నారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీకి రెండుసార్లు అధ్యక్షులుగా పని చేసిన గొప్ప మేధావి కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేశేళ్ల గోవిందమల్లిబాబు, పైడి నాగభూషణరావు, రెల్ల సురేష్, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, దంత త్రినాథరావు, కూరాకుల వెంకటరావు పాల్గొన్నారు.

మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యాన...

మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య దేశ చరిత్రలో చెరగని స్థానమని ఎన్నో సంస్కరణలు సంక్షేమానికి కృషి చేసిన దార్శినికుడని దళిత బహుజన సంఘాల నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా సంజీవయ్య పార్కులో దళిత బహుజన సంఘాల జెఎసి నాయకులు దామోదరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కంఠ వేణు, శ్రీను, పిట్టా చంద్రపతి, ఎల్.అనంతరావు, యజ్జల గురుమూర్తి, గంజి ఎజ్రా హాజరయ్యారు.


శంకుస్థాపన చేస్తున్న తిలక్

పేదల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- నందిగాం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని సైలాడ సచివాలయాన్ని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు నేరుగా సంక్షేమ కార్యక్రమాలు సిఎం జగన్మోహన్ రెడ్డి అందజేస్తున్నారని అన్నారు. సచివాలయ పరిధిలోని కాలువలు, రహదారుల సమస్యలను సర్పంచ్ శంబాన దానయ్య, ఎంపిటిసి పిన్నింటి జయరాంలు వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వారి సమస్య పరిష్కారానికి సచివాల సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులను, సచివాలయ పనులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్లాన భైరాగి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి అంబోడి విష్ణు, సర్పంచ్ బోరుపద్ర సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నేలను కాపాడుకుందాం

ప్రజాశక్తి- రణస్థలం

నవధాన్యాలు పంట పండించి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబకు కృష్ణ పిలుపునిచ్చారు. రణస్థలంలో నవధాన్యాలు వేయండి... నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడండి అనే నినాదాలు ఇస్తూ... రైతులతో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ప్రధాన పంట వేసే ముందు నవధాన్యాలను 30 రకాల విత్తనాలను ఎకరానికి 12 కిలోల చొప్పున వేసి నలభై ఐదు రోజులు బాగా పెరగనివ్వాలన్నారు. ఆ తరువాత వచ్చే పంటను పశువుల మేతకు, మల్చింగ్‌కు మిగిలిన


ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

వాటిని నేలలో కలియ దున్నడం వల్ల ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలను నేలలో సమృద్ధిగా అభివృద్ధి చేయవచ్చు అని సూచించారు. అనంతరం రైతులకు సిరి ధాన్యాలు ఉపయోగాలు గురించి వివరించారు. మొక్కజొన్నలో 12వ వారం పొలంబడిలో భాగంగా రణస్థలం డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరి సమక్షంలో నిర్వహించారు.

20న జాబ్‌మేళా

ప్రజాశక్తి- టెక్కలి

విశాఖ, హైదరాబాద్‌ల్లో ఉన్న గ్రాన్యూల్స్ ఇండియా గ్రావిటీ, ఫార్మా న్యూలాండ్, పార్మా హెటిరో, వసుధ, శ్రీకృష్ణ ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాల ఎంపికకు ఈ నెల 20న జామ్‌మేళా నిర్వహిస్తున్నామని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎంపికైన వారికి 45 రోజుల పాటు ఆయా ఫార్మా రంగాల్లో వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. డిగ్రీ కెమిస్ట్రీ ఉత్తీర్ణత, చదువుతున్న వారు అర్హులని చెప్పారు. అదే విధంగా టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన వారూ హాజరుకావచ్చునని తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- టెక్కలి

ఈ నెల 18న మహశివ రాత్రి సందర్భంగా మండలంలోని రావివలస ఎండల మల్లిఖార్జున స్వామి దేవాలయ ఉత్సవాలకు ప్రత్యేక బస్సులను నడపున్నామని డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ప్రతి పావు గంటకూ ఒక బస్సు చొప్పున నడుపుతున్నామని పేర్కొన్నారు. యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాధారణ టిక్కెట్ డబ్బులు మాత్రమే వసూళ్లు చేస్తామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన


అవగాహన కల్పిస్తున్న రేవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలను, రైతులు ప్రకృతి సేద్య విధానంలో చెరకు పంటలను ఏ విధంగా సాగు చేస్తున్నారు, సహజ సేద్యంగా బెల్లం తయారీ గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రేవతి మాట్లాడుతూ ప్రకృతి సాగు విధానాలను, ప్రకృతి సేద్యంలో పండించిన ఉత్పత్తులకు మార్కెట్లో ఎంత డిమాండ్ ఉన్నదో వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్షుంనాయుడు, చిరంజీవి పాల్గొన్నారు.

నీలంపేటలో రెండిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని తెప్పలవలస పంచాయతీ నీలంపేటలో మంగళవారం సంభవించిన అగ్నిప్రమాదంలో యాగాటి సింహాద్రి, కుప్పిలి ఆదినారాయణకు చెందిన పూరిళ్లు దగ్ధమయ్యాయి. దీంతో బాధితులు కట్టుబట్టలతో వీధిన పడ్డారు. ఈ ప్రమాదంలో దుస్తులు, వంటపాత్రలు, విద్యుత్ మీటర్లు, రేషన్, ఆధార్, తదితర విలువ కార్డులను కాలిపోయాయి. సామగ్రి, వంటపాత్రలు, రేషన్, ఆదార్ కార్డులు, తదితర విలువైన కాగితాలు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న రణస్థలం అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్


దుస్తులను అందజేస్తున్న సాయికుమార్

షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందని ప్రాథమిక అంచనా వేశారు. విషయం తెలుసుకున్న ఎంపిపి ప్రతినిధి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలకు భరోసా కల్పించి ఆర్థికసాయంగా కొంత నగదు, నిత్యావసర సరుకులు, దస్తులు, దుప్పట్లు, వంటపాత్రలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, సర్పంచ్ బొమ్మలాట శ్రీరాములు, సచివాలయం కన్వీనర్ దన్నాన హరి, మాజీ సర్పంచ్ కొయ్య సోములు పాల్గొన్నారు.

గడ్డివామి...

పలాస : మండలంలోని బొడ్డపాడులో బొడ్డు బారికయ్య పొలంలో ఉన్న తన ఆవులు మేపుకునేందుకు తెచ్చుకున్న గడ్డివాము దగ్ధమైంది. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. కక్షపూర్తిగానే గడ్డివామిని దగ్ధం చేశారని ఆరోపించారు. ఈ ప్రమాదంలో రూ.70 వేలు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు.


ఆటలను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి వసంతరెడ్డి

క్రీడలతో మానసిక ఉల్లాసం

సంతబొమ్మాళి : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి అన్నారు. మండలంలోని హనుమంతునాయుడుపేట పంచాయతీ సీతారాంపురంలో కబడ్డీ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. సర్పంచ్ ప్రతినిధి పాల మహేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోళ్ల భాస్కరరావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ సుగ్గు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ సర్పంచ్ ధనుంజయరెడ్డి, సీరపు నర్సింహమూర్తి, గిన్ని ప్రకాష్, భద్రాచలం లోకేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

పరశురాంపురంలో 'ఇదేం కర్మ'

మెళియాపుట్టి: మండలంలోని పరుశురాంపురంలో మంగళవారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు కలమట వెంకటరమణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అనంతరం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి టిడిపి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, బుర్ల లలిత కుమారి, ఉర్లాన వసంత్, మాలతి శ్రీధర్ పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై సమీక్ష

సోంపేట : గ్రామాల్లోని భూములను రీ సర్వే పూర్తి చేయాలని ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు, ఆర్‌డిఒ సీతారామ్మూర్తి సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వై.వి.ప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ మేరకు ఇప్పటివరకు నిర్వహించిన భూముల రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కేంద్రంలో ఈనెల 25,26 తేదీల్లో నిర్వహించనున్న ఐఎఫ్‌టియు 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కృష్ణవేణి పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళం రూరల్ మండలం తంగివానిపేటలో మహాసభలను పోస్టరును మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, కర్షక హక్కులను కారాస్తూ నియంతృత్వపు పోకడలను అవలంబిస్తున్నారన్నారు. దశాబ్దాల పాటు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ ఆర్‌ఎస్‌ఎస్ సొంత అజెండాను అమలు చేస్తున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 25న నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానం నుంచి శాంతినగర్ కాలనీలో ఉన్న కళింగ భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్మికుల ర్యాలీ వందలాదిగా ప్రజలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.అప్పలరాజు, బి.అప్పారావు, చిన్నారావు, వీరస్వామి, బి.బాలకృష్ణ, లక్ష్మి, బి.సరస్వతి, బి.రాములమ్మ, జి.రాములమ్మ, రమణమ్మ, శ్రీను పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణవేణి


విద్యార్థులకు బోధిస్తున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

బోధనలో మెళుకువలు పాటించాలి

ప్రజాశక్తి- కవిటి

బోధించేటప్పుడు ఉపాధ్యాయులు మెళుకువలు పాటించడం ద్వారా విద్యార్థులు విషయాన్ని సులువుగా అర్థం చేసుకుంటారని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. మండలంలోని ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులు పనితీరు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల రికార్డుల పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

రేషన్ ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని హరిదాసుపురానికి చెందిన లబ్ధిదారులకు జనవరి నెలలో రేషన్ అందించడం లేదని భాగ్యలక్ష్మి, నారాయణమూర్తి, రామచంద్రుడు అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో డిటి ఎస్.భాగ్యలక్ష్మిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 మంది లబ్ధిదారులకు బయోమెట్రిక్ వేయించి కూడా రేషన్ ఇవ్వలేదని వివరించారు. తక్షణమే స్పందించి రేషన్ ఇప్పించాలని కోరారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి పుష్ప

ఎంపిపి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని కేదారపురం పంచాయతీలో సచివాలయం పనితీరు, అంగన్వాడీ కేంద్రం, జగనన్న గోరు ముద్దు (మధ్యాహ్న భోజనంమీల్స్)ను ఎంపిపి బోర పుష్ప మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం పదార్థాలు అందుతున్నదీ లేనిదీ పరిశీలించారు. గ్రామ సచివాలయం సిబ్బంది పనితీరు ప్రభుత్వ పథకాలు అమలును పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నీలాపు సారథి, సాడి గురుమూర్తి, మాజీ ఎంపిపి కారింగి మోహనరావు, ఎంపిటిసి ఎం.చక్రవర్తిరెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్‌సిఐ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా 'గొర్లె'


శ్రీనివాసనాయుడు

శ్రీకాకుళం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారత ఆహార సంస్థ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా గొర్లె శ్రీనివాస నాయుడు నామినేట్ చేయబడ్డారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ పదవి దక్కడానికి తోడ్పాటు అందించిన రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్విని కుమార్ చౌబేలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రైతుల ప్రయోజనం కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానని శ్రీనివాసనాయుడు హామీనిచ్చారు.


నివాళ్లర్పిస్తున్న జగన్మోహనరావు


జి.సిగడాం : కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువకులు

వీర జవానులకు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశంలోని జమ్మూకాశ్మీర్‌లో 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో మృతి చెందిన 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నగరంలోని శాంతా కళ్యాణ అనురాగ నిలయంలో ఘనంగా నివాళ్లర్పించారు. పాకిస్థాన్‌లోని జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ చేపట్టిన ఈ దాడిలో మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి బ్లాక్ డే నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, పెంకి చైతన్యకుమార్, బి.చిన్నయరావు, కె.సత్యనారాయణ, బి.సతీష్, బి.శ్రీధర్, సాయి, సూర్యప్రకాష్, మదీనా, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జి.సిగడాం : పుల్వామా ఉగ్రదాడిలో దేశ రక్షణ కోసం ప్రాణాలను విడిచిన అమర జవాన్లకు మండలంలోని టి.డి.వలసలో కొవ్వత్తులతో నివాళ్లర్పించారు. జై జవాన్... జై కిసాన్... భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టంకాల రామకృష్ణ, ఉప సర్పంచ్ టంకాల తేజేశ్వరరావు, ఎస్.గోపాల్, టంకాల సుధాకర్, మూర్తి, ఉత్తరావల్లి రమణ, టంకాల సాయి సహా పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - భామిని

కొత్తూరు మండలం పూతికవలస గిరిజన బాలికల వసతి గృహంలో పదో తరగతి చదువున్న కొండగొర్రి పవిత్ర (16) అనారోగ్యంతో మరణించిందని, ఆమె మృతికి ఐటిడిఎ అధికారుల నిర్లక్ష్యమేనని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు ఆందోళన చేశారు. పవిత్ర తల్లిదండ్రులు కొండగొర్రి కేదార్, మాయంతి, గిరిజన సంఘాలు, స్థానిక గిరిజనులు దిమ్మిడిజోల, బాలేరు గ్రామాల మధ్య గల ప్రేమగిరి కూడలి వద్ద మృతదేహాన్ని ప్రధాన రహదారిపై ఉంచి మంగళవారం బాధితులకు న్యాయం చేయాలంటూ రాస్తారోకో చేశారు. దీంతో సుమారు 2 గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. అదే సమయంలో బాలేరు వస్తున్న సబ్ కలెక్టర్ నూరల్‌కమర్ వాహనాన్ని నిలిపి పవిత్ర కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వసతి గృహంలో అధికారుల పర్యవేక్షణ లేదని, 500మంది విద్యార్థినిలు ఉంటే కనీసం ఒక జిఎన్ఎం లేదని, విద్యార్థిని పవిత్ర ఆరోగ్యం వసతిగృహంలో క్షీణించిన తర్వాతే తల్లిదండ్రులకు తెలిపారని అన్నారు. పవిత్రను తల్లిదండ్రులు సీతంపేట ఆసుపత్రిలో చేర్చిన తర్వాత వసతి గృహ సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదన్నారు. సంఘాల ఒత్తిడి నేపథ్యంలో సోమవారం సీతంపేట నుంచి విశాఖకు తరలించే క్రమంలో మార్గమధ్యలో పవిత్ర చనిపోయిందని అన్నారు. పేదరికంలో ఉన్న పవిత్ర కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని, ఆమె ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిరావు సబ్‌కలెక్టర్‌ను కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, పవిత్ర మృతిపై కమిటీ వేసి దర్యాప్తు చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం చేస్తామని, ఉద్యోగం అంశంపై ఐటిడిఎ పిఒకు సూచిస్తామని, అవకాశంఉంటే ఐటిడిఎ ద్వారా ఫైనాన్స్ ఏర్పాటు చేస్తామని, ఈ అంశం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన నిలిపివేశారు. కార్యక్రమంలో బాలేరు ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్, గిరిజన సంఘం మండల కార్యదర్శి కొండగొర్రి భాస్కరరావు, అధ్యక్షులు కొండల ప్రసాద్, గిరిజన సంఘం సభ్యులు కొండగొర్రి నూకయ్య, బిడ్డిక గంగన్న, గిరిజనులు ఉన్నారు.


సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

తోటలో మందు పార్టీ!

'ఉపాధి' అధికారులపై కలెక్టర్‌కు ఎంపిపి ఫిర్యాదు

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని జాతీయ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న అధికారులు మంగళవారం మధ్యాహ్నం చల్లవానిపేట సమీపంలోని ఓ తోటలో జరుపుకున్న మందు పార్టీపై కలెక్టర్‌కు ఎంపిపి వాన గోపి ఫిర్యాదు చేశారు. పంగవానిపేటలో ఓ టెక్నికల్ అసిస్టెంట్ ఇంటి వద్ద మంగళవారం గావు సంబరాలు జరిగాయి. ఈ సంబరాలకు వచ్చిన వీరు భోజనానికి ముందు మద్యం సేవించేందుకు తోటలోకి వెళ్లారు. కార్యాలయంలోని హాజరు పట్టికలో సంతకాలు చేసి మరీ వీరు ఇలా విందులు నిర్వహిస్తుంటే ఉద్యోగాలు ఎలా చేస్తున్నారని ఎంపిపి ప్రశ్నిస్తున్నారు. ఎన్‌ఆర్ ఇజిఎస్ అధికారులు తోటలో మందు పార్టీ చేసుకుంటుండగా ఎవరో ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇవి వైరల్‌గా మారాయి. బాధ్యత గల అధికారులు ఇలా పట్టపగలు మందు పార్టీలు నిర్వహించడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఎపిఒ నారాయణరావుతో పాటు, కొందరు టిసి, ఎఫ్‌సిలు ఈ పార్టీలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎపిఒ నారాయణరావు వద్ద ప్రస్తావించగా గౌస్ సంబరం నిర్వహిస్తున్న వారి ఇంటి వద్ద రద్దీగా ఉందని, భోజనం, చికెన్ తోటలోకి పంపిస్తే అక్కడ భోజనం చేశాం తప్ప, మరేమీ లేదని బదులిచ్చారు.

28లోగా లైఫ్ ధ్రువపత్రాలు అందజేయాలి

రణస్థలం: విశ్రాంతి ఉద్యోగులందరూ ఈ 28లోగా లైఫ్ ధ్రువపత్రాలను స్థానిక ఎస్‌టిఒ కార్యాలయానికి అందజేయాలని రణస్థలం, లావేరు మండలాల సంఘం అధ్యక్షులు పున్నాన నరసింహులు నాయుడు ఒక ప్రకటనలో కోరారు. జీవన ప్రమాణ పత్రాలు అందజేయకపోతే పెన్షన్ నిలుపుదలయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 430 మంది పెన్షనుదారులు ఉండగా... 300 మంది వరకు లైఫ్ ధ్రువపత్రాలను అందజేశారని తెలిపారు. మిగిలిన వారు విధిగా జీవన ప్రమాణ పత్రం నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే ఇకెవైసి కూడా చేసుకోవాలని సూచించారు.


పరామర్శిస్తున్న అప్పలనాయుడు

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : వైసిపి సీనియర్ నాయకులు లుకాలాపు అప్పలనాయుడు మంగళవారం పలువురిని పరామర్శించారు. మండలంలోని పాతకుంకాంకు చెందిన చెందిన బాధ శ్రీనివాసరావు, వెంకటాపురానికి చెందిన శంభాన తువుడు భార్య అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకుని ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట గోవిందపురం, కొత్తకోట మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, శివంగం నాగరాజు, జగ్గురోతు రాము, రాము, సనపతి గౌరినాయుడు, గురునాయుడు ఉన్నారు.

సకాలంలో రెన్యువల్ చేసుకుంటేనే రాయితీ

రణస్థలం రూరల్ : మండలంలోని పైడిభీమవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులు సొసైటీ రుణాలను సకాలంలో రెన్యూల్ చేసుకుంటేనే రాయితీ వర్తిస్తుందని సిఇఒ గిరి బుచ్చి రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్ష లోపు పంట రుణం తీసుకున్న వారు ఏడాదిలోగా చెల్లిస్తే జిరో వడ్డీలు వరిస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 20లోపు 4 శాతం వడ్డీ చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తాయని చెప్పారు. రైతులు ఫొటో, 1బి, ఆధార్ కార్డుతో కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

అనాథాశ్రమంలో జన్మదిన వేడుకలు

ఇచ్ఛాపురం : పట్టణానికి చెందిన సీనియర్ టీడిపి నాయకులు రెయ్యి జానకిరావు తన జన్మదిన వేడుకలకు సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమలో మంగళవారం నిర్వహించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేసి వారితో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం వృద్ధులతో కాసేపు గడిపారు. ఈ మేరకు పలువురు జానకిరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.